సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 8 । ఆగస్టు । 2025



తరగతులు ఏడు..

రాష్ట్ర సరిహద్దుల్లోని సిర్‌పూర్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడో తరగతి వరకు ఉండగా.. 3 గదులు మాత్రమే ఉన్నాయి.

- 9లో ▸



ఆర్‌ఎంపీలు, పీఎంపీలను..

గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించే పీఎంపీలు, ఆర్‌ఎంపీలను ప్రభుత్వం గుర్తించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు విఠల్ కోరారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
37.7 /21.9

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

12న సమాచార కమిషన్ రాక

- చీఫ్ కమిషనర్‌తోపాటు ఐదుగురు కమిషనర్లు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : తెలంగాణ స్టేట్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డితోపాటు ఐదుగురు కమిషనర్లు పీవీ శ్రీనివాసరావు, బోరెడ్డి అయోధ్యరెడ్డి, మోహిసినా పర్వీన్, దేశాల భూపాల్, వైష్ణవి మేర్ల ఈ నెల 12న కామారెడ్డికి రానున్నారు. జిల్లా కలెక్టరేట్‌లో వివిధ శాఖలకు సంబంధించి హియరింగ్స్‌లో పాల్గొంటారు. సమాచార కమిషనర్ల రాక నేపథ్యంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో అధికారులు అందుకు అవసరమైన సమాచారాన్ని సిద్ధం చేస్తున్నారు. కాగా చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి హోం, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్లకు సంబంధించి 24 కేసులు, కమిషనర్ పీవీ శ్రీనివాస్‌రావు వ్యవసాయం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి సంబంధించి 28 కేసులు, కమిషనర్ మొహిసినా పర్వీన్ రెవెన్యూ, ట్రైబల్ వెల్ఫేర్‌కు సంబంధించి 22 కేసులు, కమిషనర్ దేశాల భూపాల్ రెవెన్యూకు సంబంధించి 20, కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి రెవెన్యూ, హెల్త్‌కు సంబంధించి 22 కేసులకు సంబంధించి విచారణ జరపనున్నారు.

ఆర్టీసీ డ్రైవర్ సస్పెన్షన్

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాములుపై క్రమశిక్షణ చర్యల కింద సస్పెన్షన్ వేటు పడింది. గత 15 రోజుల క్రితం మేడ్చల్ వద్ద ఆర్టీసి బస్సు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని, ఈ ఘటనపై విచారణ చేపట్టి డ్రైవర్‌పై చర్యలు తీసుకున్నట్లు డిపో మేనేజర్ కరుణశ్రీ తెలిపారు. అయితే రోడ్డు ప్రమాద ఘటనలో తన తప్పిదం లేదని, బైక్‌పై ఉన్న వ్యక్తులు మద్యం సేవించి రాంగ్ రూట్‌లో రావడంతోనే ప్రమాదం జరిగిందని, తన పొరపాటు లేదని డ్రైవర్ వాపోయాడు. ఆర్టీఏ అధికారులు విచారణ చేపట్టిన అనంతరం తన డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేయలేదని తెలిపాడు. సస్పెన్షన్ ఎత్తివేసి తనకు న్యాయం చేయాలని డ్రైవర్ కోరారు.

చిరుత సంచారంతో భయాందోళన

మాచారెడ్డి : మండలంలోని అక్కాపూర్ అటవీ ప్రాంతంలో గత నాలుగైదు రోజులుగా చిరుత సంచరిస్తుండడంతో శివారు గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మూడు రోజుల కిందట అక్కాపూర్ గ్రామానికి చెందిన అరిగె నర్సయ్య లేగదూడను పొలం దగ్గర కట్టేసి ఇంటికి వెళ్లాడు. మరునాడు పొద్దున పొలం దగ్గరకు వెళ్లిన నర్సయ్య లేగదూడ చనిపోయి ఉండడంతో అధికారులకు సమాచారం అందించగా, లేగదూడపై చిరుత దాడి చేసి చంపినట్లు నిర్ధారించారు. ఆ రాత్రి చనిపోయిన లేగదూడను అక్కడే ఉంచి ట్రాక్ కెమెరాలను అమర్చారు. మరుసటి రోజు ఫుటేజీని పరిశీలించగా, కెమెరాల్లో చిరుత దాడి దృశ్యాలు కనిపించాయి. దీంతో అటవీ ప్రాంత ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతుందోనని వణికిపోతున్నారు. శివారు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

పార్థి దొంగల ముఠా సభ్యుడి అరెస్టు

కామారెడ్డి క్రైం: జాతీయ రహదారుల వెంబడి ఆగి ఉన్న వాహనాలను టార్గెట్ చేస్తూ దారి దోపిడీలకు పాల్పడడంతోపాటు ఆయా జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న పార్థి దొంగల ముఠా సభ్యుడిని పోలీసులు అరెస్టు చేశారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ముఖ్కేడ్ ప్రాంతానికి చెందిన ముఠాలోని ముగ్గురిని కొంతకాలం క్రితం కామారెడ్డి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. కామారెడ్డి, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో జాతీయ రహదారులపై జరుగుతున్న దారి దోపిడీలు, రోడ్డుకు సమీపంలోని ఇళ్లలో దొంగతనాలకు సంబంధించిన కేసులు ఈ ముఠాపై నమోదై ఉన్నాయి. జిల్లాలోని గాంధారి, పిట్లం, బీర్కూర్, సదాశివనగర్, మద్నూర్, తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లలో పార్థి ముఠాపై కేసులున్నాయి. పోలీసులు ముగ్గురు సభ్యులతోపాటు ఓ రిసీవర్‌ను అరెస్టు చేసినప్పటికీ.. ప్రధాన సభ్యుడు భాస్కర్ బాపూరావు చౌహాన్ ఎనిమిది నెలలుగా తప్పించుకుని తిరుగుతున్నాడు. ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు నిందితుడి కోసం చాలా రోజులుగా గాలిస్తున్నాయి. అతడిని గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐలు శ్రీనివాస్, సంతోష్‌కుమార్, ఎస్సైలు ఆంజనేయులు, రంజిత్, ఉస్మాన్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సిబ్బంది గణపతి, శ్రీనివాస్, రాజేందర్, శ్రావణ్, లక్ష్మీకాంత్, స్వామి, మైసయ్య, రవిని ఎస్పీ అభినందించారు.

అక్కా చెల్లెళ్లకు ఆర్టీసీ షాక్!

స్పెషల్ బస్సుల పేరుతో చార్జీ పెంపు

- కామారెడ్డి నుంచి జేబీఎస్‌కు రూ.70 అదనం
- రాఖీ పండగ సందర్భంగా అడ్డగోలుభారం





కామారెడ్డి నుంచి జేబీఎస్‌కు బస్సు చార్జీ టిక్కెట్, బస్టాండ్‌లో ప్రయాణికులు

మహాలక్ష్మి పథకాన్ని విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్న ఆర్టీసీ అవసరం మేరకు ఎక్స్‌ప్రెస్ బస్సులను అందుబాటులో ఉంచడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. వాటిని పట్టించుకోని సంస్థ స్పెషల్ బస్సుల పేరుతో చార్జీల పెంపుపై ఆసక్తి చూపుతోంది. పండగ రోజుల్లో చార్జీలు పెంచే ఆర్టీసీ.. ఆడ బిడ్డలకు ఎంతో ప్రత్యేకమైన రాఖీ పౌర్ణమి సందర్భంగా డీలక్స్ బస్సు చార్జీలను పెంచింది. మహాలక్ష్మి పథకం ద్వారా ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణిద్దామంటే రద్దీ చాలా ఎక్కువగా ఉంటోందని, డబ్బులు చెల్లించి డీలక్స్ బస్సుల్లో వెళ్దామంటే టికెట్ చార్జీ పెంచేశారని ఆడబిడ్డలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పండగల సీజన్‌లో సాధారణంగా వస్తువుల మీద ఆఫర్లు ప్రకటిస్తుంటారు. కానీ ఆర్టీసీ యాజమాన్యం మాత్రం పండగ సీజన్‌లో చార్జీలు అది కూడా 25 శాతం నుంచి 35 శాతం పెంచి ప్రయాణికులపై అడ్డగోలు భారం మోపుతోంది. గత కొంత కాలంగా పండగల సీజన్‌లో చార్జీలు పెంచి వసూలు చేస్తున్న ఆర్టీసీ ఆఖరుకు రాఖీ పండగ రద్దీని క్యాష్ చేసుకునేందుకు బాదుడు షురూ చేసింది. కామారెడ్డి నుంచి జేబీఎస్‌కు సాధారణంగా డీలక్స్ బస్సు చార్జీ రూ.230 ఉండగా, దానిని పండగ సందర్భంగా రూ.300కు పెంచేసింది. అదే మహారాష్ట్ర లోని నాందేడ్ నుంచి హైదరాబాద్‌కు నడిచే బస్సు ఎక్కితే రూ.190 తీసుకుంటున్నారు. దానికి, దీనికి రూ.110 తేడా ఉంటోంది. కాగా హైదరాబాద్‌లో ఉంటున్న అక్కా చెల్లెల్లు కామారెడ్డికి రావాలన్నా, కామారెడ్డి ప్రాంతంలో ఉంటున్న అక్కాచెల్లెల్లు హైదరాబాద్‌కు వెళ్లాలన్నా ఆర్టీసీ వడ్డనను భరించాల్సిందే. మహాలక్ష్మి పథకం ద్వారా ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించాలనుకున్నా అరకొర బస్సులు నడుపుతున్నారు. ముఖ్యంగా కామారెడ్డి నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు తక్కువగా ఉండడంతో నిలబడి కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. తప్పనిసరి పరిస్థితుల్లో డీలక్స్ బస్సులు ఎక్కుతున్నారు. డీలక్స్ చార్జీ ఇప్పటికే రూ.230 దాకా ఉండగా, పండగ పేరుతో రూ.300 వసూలు చేయడం మహిళలకు మరింత భారంగా మారింది. మరికొన్ని రూట్లలోనూ స్పెషల్ పేరుతో చార్జీలు పెంచి వసూలు చేస్తున్నారు. ఆర్టీసీ తీరుపై మహిళలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అవ్వగారింటికి వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు మహిళలు ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లతో ఇదేం దోచుకునుడు అంటూ నిష్టూరమాడుతున్నారు. తమ చేతిలో ఏమీ లేదని, అధికారులు ఏది చెబితే అది పాటిస్తామంటూ డ్రైవర్లు, కండక్టర్లు వారికి నచ్చజెప్పుతున్నారు.

కుటుంబాలపై ఎంతో భారం..

రాఖీ పండగ కోసం కుటుంబం మొత్తం బస్సులో సొంతూళ్లకు వెళ్లాలంటే అడ్డగోలు భారం మోయాల్సి వస్తోంది. నలుగురు కుటుంబ సభ్యులు కలిసి వెళ్లాలంటే అదనంగా రూ.280 భరించాల్సిన పరిస్థితి నెలకొంది. తిరిగి వెళ్లే సమయంలో మరో రూ.280 అదనంగా వెచ్చించాల్సి వస్తోంది. అలాగే డీలక్స్‌లో మహిళలకు ఉచిత ప్రయాణం లేకపోవడం కారణంగా పూర్తి చార్జీ చెల్లించాల్సి రావడం భారం పడుతోంది. పండగల సందర్భంగా అందరూ ఆఫర్లు ఇచ్చి వస్తువుల ధరలు తగ్గిస్తే, ఆర్టీసీ సౌకర్యాలు కల్పించకపోగా, చార్జీలు పెంచి నడ్డివిరుస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ చార్జీల వడ్డనపై ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు నోరువిప్పాల్సిన అవసరం ఉంది.

రాఖీ పండగకు పోవద్దా..

అన్నా చెల్లెలు, అక్కా తమ్ముడి ఆత్మీయతను తెలిపే రాఖీ పౌర్ణమి పండగ కోసం ఎక్కడెక్కడో ఉన్న వాళ్లంతా తల్లిగారింటికి పయనమవుతారు. ఒకటి రెండు రోజుల ముందే చాలా మంది బయల్దేరుతారు. శుక్రవారం వరలక్ష్మి వ్రతం సెలవు దినం, శనివారం రాఖీ పౌర్ణమి, మరుసటి రోజు ఆదివారం సెలవు కావడంతో వరుస సెలవుల నేపథ్యంలో మూడు రోజులపాటు తల్లిగారింట గడపొచ్చని ఆడపిల్లలు ఎన్నో ఆశలతో బయల్దేరితే ఆర్టీసీ చార్జీల పెంపుతో చాలా మంది లబోదిబోమంటున్నారు. ఏడాదికోసారి వచ్చే రాఖీ పండగ పూట అన్నదమ్ములకు రాఖీ కట్టి ప్రేమను చాటుకునేందుకు వెళ్లాలంటే బస్సు చార్జీలు వారిని బాధిస్తున్నాయి. పండగకు ముందుగానే వెళ్తారని గ్రహించిన ఆర్టీసీ ముందుగానే చార్జీలను పెంచేసింది. కాగా పండగ కోసం తమ వారి వద్దకు వెళ్లేందుకు బస్సుల్లో బయల్దేరిన వారు ఒక్కసారిగా పెరిగిన చార్జీలను చూసి షాక్ అవుతున్నారు. కొందరైతే కండక్టర్లు, డ్రైవర్లతో గొడవకు దిగుతున్నారు. తామేం చేయలేమంటూ వారు చేతులెత్తేస్తున్నారు. అయితే ఆర్టీసీ ఉచిత ప్రయాణం ఏమోగానీ ఇతర బస్సుల చార్జీలను అడ్డగోలుగా పెంచిందని చాలా మంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కామారెడ్డిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇంటి వద్ద అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

- ప్రభుత్వం ఉచితంగా ఇసుక, మొరం అందిస్తోంది
- అధికారులు నిరంతరం పనులను పర్యవేక్షించాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచన
- జిల్లా కేంద్రంలో పనుల పరిశీలన

కామారెడ్డి క్రైం : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని రాజానగర్ కాలనీలో గురువారం పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా పునాదుల వరకు నిర్మాణం పూర్తయిన ఇళ్లకు మొదటి విడత బిల్లులు మంజూరయ్యాయా అని వాకబు చేశారు. ఇళ్ల నిర్మాణానికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉచితంగా ఇసుక, మొరం అందజేస్తోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు ఇసుక, మొరం, ఇతర నిర్మాణ సామగ్రికి సంబంధించి ఎలాంటి సమస్యలు లేకుండా పనులను పర్యవేక్షించాలని హౌసింగ్ పీడీ విజయ్‌పాల్‌రెడ్డి, కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డిని ఆదేశించారు. ప్రారంభమైన అన్ని ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాలన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి..



గర్గుల్‌లోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం : ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సిబ్బందికి సూచించారు. కామారెడ్డి మండలం గర్గుల్‌లోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని మౌలిక వసతులు, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రం భవనానికి విద్యుత్ సరఫరా, నీటివసతిని కల్పించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్య కేంద్రం పరిసరాల్లో రాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహించాలని పోలీసు అధికారులను, కేంద్రంలో అవసరమైన ఇతర మౌలిక సదుపాయాలకు తగిన ఏర్పాట్లు చేయాలని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌ను ఆదేశించారు. వైద్యాధికారులు ప్రభ దయాకిరణ్, జోహా, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా దశరథ్



కామారెడ్డి టౌన్ : సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎల్.దశరథ్ నియమితులయ్యారు. ఇటీవల నిర్వహించిన పార్టీ జిల్లా మూడో మహాసభల సందర్భంగా జిల్లా కార్యవర్గాన్ని గురువారం ప్రకటించారు. జిల్లా సహాయ కార్యదర్శులు బాలరాజు, దబాస్ రాములు, సభ్యులుగా రాజమణి, విమల, నాగమణి, దేవయ్య, బాలరాజు, శంకర్, మల్లేశ్, లక్ష్మణ్, శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

కమిటీలంటూ కాలక్షేపం



మాట్లాడుతున్న ఉద్యోగుల జేఏసీ చైర్మన్ నరాల వెంకట్‌రెడ్డి తదితరులు

- సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం
- ఉద్యోగుల జేఏసీ చైర్మన్ నరాల వెంకట్‌రెడ్డి

కామారెడ్డి అర్బన్: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు 57 సమస్యల పరిష్కారం కోసం 18 నెలలుగా ఓపికతో ఉన్నారని, ఉప సంఘం, ఐఏఎస్ అధికారుల కమిటీ అంటూ ప్రభుత్వం కాలక్షేపం చేస్తోందని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు, ఉద్యోగుల జేఏసీ చైర్మన్ నరాల వెంకట్‌రెడ్డి అన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా భవన్‌లో గురువారం జేఏసీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం వెంకట్‌రెడ్డి మాట్లాడారు. పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర జేఏసీ నిర్దేశించిన ప్రణాళికకు అనుగుణంగా జిల్లాలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని, అలాగే సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తామని అన్నారు. సీఎంతో జరిపిన చర్చల్లో ప్రతినెలా రూ.700 కోట్ల రూపాయల బకాయిలు విడుదల చేస్తామని హామీ ఇచ్చినా అమలు కావడం లేదని, పీఆర్సీ సంగతి మరిచి పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా శాఖల్లో ఉద్యోగుల పోస్టులను తగ్గిస్తున్నారని ఆరోపించారు. హెల్త్‌కార్డులు, సీపీఎస్ రద్దు, బకాయి ఉన్న ఐదు డీఏల విడుదల, పీఆర్సీ అమలు, 317 జీవో బాధితులకు న్యాయం, కొత్త మండలాలకు పోస్టుల మంజూరు కోసం డిమాండ్ చేస్తున్నామని అన్నారు. నాయకులు దేవేందర్, కుషాల్, విఠల్‌రావు, లింగం, మహమ్మదీ సుల్తానా, సీహెచ్ లింగం, హన్మంత్‌రెడ్డి, నాగరాజు, మనోహర్‌రావు, నిజాం పాల్గొన్నారు.

నాట్లు వేసేప్పుడు ఎందుకు అడ్డుకోలేదు?

- గండిమైసమ్మకుంట ఘటనపై ఆర్డీవో పార్థసింహారెడ్డి
- గడ్డి మందు పిచికారీ చేసిన పొలం పరిశీలన
- విచారణ అనంతరం చర్యలు తీసుకుంటాం

గాంధారి(ఎల్లారెడ్డి): అటవీశాఖ భూమిలో వరి నాట్లు వేసేప్పుడు ఎందుకు అడ్డుకోలేదని సంబంధిత అధికారులను ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి ప్రశ్నించారు. మండల పరిధిలోని సీతాయిపల్లి గ్రామాన్ని తహసీల్దార్ రేణుకాచౌహాన్, ఎఫ్ఆర్వో హేమచందనతో కలిసి ఆర్డీవో గురువారం సందర్శించారు. గండిమైసమ్మ అటవీప్రాంతంలో రైతులు కోరే పెద్ద మల్లయ్య, చిన్న మల్లయ్య సాగు చేస్తున్న వరి పొలంపై అటవీఅధికారులు గడ్డిమందు పిచికారీ చేయగా, పొలాన్ని ఆర్డీవోతోపాటు అధికారులు గురువారం పరిశీలించారు. రైతులు, గ్రామస్తులతో మాట్లాడి భూమి వివరాలు తెలుసుకున్నారు. భూమి అటవీ శాఖకు చెందినదైతే రైతులు గత కొన్నేళ్ల నుంచి ఎలా సాగు చేస్తున్నారన్నారు. పొలంపై గడ్డి మందు పిచికారి చేయడం సరికాదన్నారు. ఈ ఘటనపై లోతుగా విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో అన్నారు. ఆయనవెంట అటవీ శాఖ సిబ్బంది, పోలీసులు ఉన్నారు.

నిషేధిత గడ్డి మందు పిచికారీ

ప్రభుత్వం నిషేధించిన గడ్డిమందును ఎక్కడి నుంచి తీసుకొచ్చారు, ఎవరు విక్రయించారని గ్రామస్తులు ప్రశ్నించారు. నిషేధించిన మందులను విక్రయిస్తే వ్యవసాయ శాఖ అధికారులు ఏం చేస్తున్నారని అన్నారు. విక్రయించిన వారు, తెచ్చిన వారు, పిచికారీ చేసిన వారిని బాధ్యులను చేసి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.



గడ్డి మందు పిచికారీ చేసిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో పార్థసింహారెడ్డి, అధికారులు

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి..



నాటు వేసిన వరి పొలంలో గడ్డిమందు పిచికారి చేసి ధ్వంసం చేసిన అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకుని పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరుతూ సీతాయిపల్లి గ్రామ రైతులు అదనపు కలెక్టర్ విక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గత 30 ఏళ్లుగా గ్రామ శివారులోని గండిమైసమ్మ కుంట ప్రాంతంలో సుమారు ఏడు ఎకరాల భూమిని సాగు చేస్తున్నామన్నారు. సదరు భూమిని సాగు చేసిన రైతు తన భూమిని కుర్మసంఘానికి అప్పగించి గ్రామం విడిచి వలస వెళ్లాడని, సంఘం సభ్యుల నుంచి కోరె పెద్ద మల్లయ్య, చిన్న మల్లయ్య కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నారన్నారు. అయితే అటవీ శాఖ అధికారులు వరి సాగు చేసిన భూమి అటవీ శాఖకు చెందినదని పొలంపై గడ్డి మందు పిచికారీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

బినామీ బండ్లపై ఫోకస్

- కలెక్టర్ దృష్టికి అద్దె వాహనాల వ్యవహారం
- మంజూరైన, పెండిగ్ బిల్లులపై ఆరా
- ఏవోకు వివరాలు సమర్పించిన హైర్ వెహికిల్స్ అసోసియేషన్



కలెక్టరేట్ ఆవరణలో అద్దె వాహనాలు

కామారెడ్డి క్రైం : జిల్లాలో దాదాపు సగం మందికి పైగా అధికారులు బినామీల పేర్లతో అద్దె వాహనాల బిల్లులు కాజేస్తున్నారని, బిల్లులు మంజూరు చేయడంలో ట్రెజరీ శాఖ కూడా నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. చాలా కాలంగా అన్ని ప్రభుత్వ శాఖల్లో నడుస్తున్న బినామీ అద్దె వాహనాలు, పెండింగ్‌లో ఉన్న అద్దె వాహనాల బిల్లుల వ్యవహారం ఎట్టకేలకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ దృష్టికి వెళ్లింది. గత సోమవారం హైర్ వెహికల్స్ డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, పూర్తి వివరాలు తెలుసుకుని తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. తాజాగా అద్దె వాహనాల వ్యవహారంపై దృష్టి సారించిన కలెక్టర్.. పూర్తి వివరాలు ఇవ్వాలని ఏవోను ఆదేశించినట్లు తెలిసింది. ఏవో మసూర్ అహ్మద్ హైర్ వెహికల్స్ డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులను బుధవారం పిలిపించి మాట్లాడారు. దీంతో వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అద్దె వాహనాల బిల్లులు, బినామీ పేర్లతో ఆయా శాఖల్లో అధికారుల వద్ద నడుస్తున్న వాహనాల వివరాలను అసోసియేషన్ ప్రతినిధులు ఏవోకు సమర్పించారు.

వివరాలు అందజేత..

నిరుద్యోగులకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం అధికారుల వద్ద అద్దె వాహనాలు పెట్టుకునే విధానాన్ని అమలు చేస్తోంది. అందుకు గాను వాహనానికి నెలకు రూ.33 వేల వరకు అద్దె చెల్లిస్తోంది. నిబంధనల ప్రకారం ప్రతి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారి తమ సొంత వాహనాలు కాకుండా అద్దె వాహనాలు పెట్టుకుని నడుపుకోవాల్సి ఉంటుంది. కానీ చాలామంది అధికారులు ప్రభుత్వ విధులకు తమ సొంత వాహనాలు నడిపిస్తూ బినామీ పేర్ల మీద ప్రతి నెలా బిల్లులు దండుకుంటున్నారనే ఆరోపణలు ఎంతో కాలంగా ఉన్నాయి. దీనిపై హైర్ వెహికల్స్ డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ అంతగా పట్టించుకోలేదు. ఇప్పుడు ఏకంగా కలెక్టర్ దృష్టికి రావడంతో చర్యలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

ఆ శాఖల్లోనే..

బినామీ వాహనాలు ప్రధానంగా ఇరిగేషన్, మిషన్ భగీరథ, డీఆర్డీఏ, వైద్యారోగ్యం, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖల్లో ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఏ శాఖలో ఎన్ని బినామీ వాహనాలు ఉన్నాయనే పూర్తి వివరాలను ఏవోకు అందజేసినట్లు అద్దె వాహనాల అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

చర్యలు తీసుకోవాలి



ప్రభుత్వ శాఖల్లో అధికారుల వద్ద అద్దె వాహనాలు నడిపిస్తూ జీవిస్తున్నాం. వాహనాల బిల్లులు నెలలు, ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెడితే మా పరిస్థితి ఏమిటి. వెంటనే బిల్లులు మంజూరు చేయాలని అధికారులకు విన్నవించాం. అలాగే బినామీ పేర్ల మీద వాహనాలు నడిపే వారిపై కూడా చర్యలు తీసుకోవాలి. న్యాయం చేయాలి. – రాజాగౌడ్, హైర్ వెహికిల్స్ డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

పెండింగ్ బిల్లులతో అవస్థలు..

ఆయా శాఖల్లో నిరుద్యోగులు అద్దె ప్రాతిపదికన పెట్టుకుని నడిపే వాహనాల బిల్లులు చాలా రోజులుగా రావడం లేదు. దీంతో వాహనాలు నడుపుతున్న వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. వాటిలో ప్రధానంగా మైనారిటీ సంక్షేమ శాఖలో నడుస్తున్న వాహనాలకు 30 నెలలుగా, వైద్యారోగ్య శాఖలో 11 నెలలుగా, డీఆర్డీఏలో 24 నెలలుగా, ఆర్అండ్‌బీలో 22 నెలలుగా, మిషన్ భగీరథలో 12 నెలలుగా, రాజంపేట ఎంపీడీవో దగ్గర నడుస్తున్న వాహనానికి 16 నెలలుగా.. ఇలా అన్ని ప్రభుత్వ శాఖల్లో నడుస్తున్న వాహనాలకు బిలుల్లు మంజూరు కావాల్సి ఉంది. బినామీ పేర్ల మీద నడిచే వాహనాలకు మాత్రం జాప్యం లేకుండా బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయనీ, నిజాయితీగా నిరుద్యోగులు నడిపే వాహనాలకు బిల్లులు ఇవ్వడం లేదని వాహనాల యజమానులు వాపోతున్నారు. పెండింగ్ బిల్లుల వివరాలు సైతం హైర్ వెహికల్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఏవోకు అందజేశారు.

క్లుప్తంగా

24న బస్వన్నపల్లిలో భారత్ కిసాన్ సంఘ్ శిక్షణ తరగతులు



రాజంపేట: మండల కేంద్రంలోని రైతు వేదికలో భారతీయ కిసాన్ సంఘ్ కార్యవర్గ సమావేశం గురువారం నిర్వహించినట్లు మండల అధ్యక్షులు మర్రి గోపాల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు సాయిరెడ్డి మాట్లాడుతూ.. సంఘ్ శిక్షణ తరగతులు ఈ నెల 24న బస్వన్నపల్లి గ్రామంలోని రెడ్డి ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్నట్లు, ప్రతి ఒక్క సభ్యుడు పాల్గొని రైతుల సమస్యలపై పోరాడాలన్నారు. కామారెడ్డి మండల అధ్యక్షుడు చిన్న అంజయ్య, జిల్లా విత్తన ప్రముఖ్ బోరెడ్డి భైరవరెడ్డి, మండల కార్యదర్శి కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ పది, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఓపెన్ పది, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లుజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్టడీ సెంటర్ అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ బి.కిషోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏవైనా సమస్యలతో మధ్యలో బడి మానేసి 14 సంవత్సరాలు వయసు ఉంటే పది పరీక్షలకు, పది పాసై రెగ్యులర్‌గా ఇంటర్ చేయని వారు ఓపెన్ ఇంటర్‌లలో ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశం ఈ నెల 18 వరకు మాత్రమేనన్నారు. ఇతర వివరాలకు పాఠశాలకు వచ్చి లేదా సెల్ నెంబర్ 97057 71871లకు సంప్రదించాలని సూచించారు.

ప్రిప్రైమరీ పోస్టుల భర్తీలో రోస్టర్ విధానం పాటించాలి



కామారెడ్డి అర్బన్: జిల్లా ప్రాథమిక పాఠశాలల్లో ప్రి ప్రైమరీ పోస్టులు(71) భర్తీ రోస్టర్ కం మెరిట్ ఆధారంగా చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎం.హరిలాల్ నాయక్, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు మదన్‌లాల్ జాదవ్ డిమాండ్ చేశారు. గురువారం అదనపు కలెక్టర్ విక్టర్‌కు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఆవిధంగా భర్తీ చేయకపోతే ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరుగుతుందని వివరించారు. రోస్టర్ లేకుండా నియమించిన పోస్టులను రద్దు చేసి మొత్తం ఖాళీలకు రోస్టర్ అమలు చేసి నియమించాలని కోరారు.

కంప్యూటర్ల మాయంలో ఎవరి హస్తమెంత?

- బాధ్యుడిపై సస్పెన్షన్ వేటు వేసి చేతులు దులుపుకున్న విద్యాశాఖ
- మరో ఉపాధ్యాయుడి పాత్ర ఉన్నట్లు అనుమానాలు



తాడ్కోల్ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం ఉన్న కంప్యూటర్లు

బాన్సువాడ: ఇంటి దొంగను ఈశ్వరుడైదా పట్టుకోలేరనే సామెతకు అద్దంపట్టినట్లు ఉంది.. పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులే కంప్యూటర్ల మాయం చేయడమనేది. ఉపాధ్యాయ వృత్తికే మాయని మచ్చలా తయారైంది. మూసిన తలుపులు మూసినట్లే ఉన్నాయి. వేసిన తాళాలు వేసినట్లే ఉన్నాయి. కానీ కంప్యూటర్ గదిలో ఉండాల్సిన కంప్యూటర్లు మాత్రం మాయమయ్యాయి. వివరాలు.. తాడ్కోల్‌లో ప్రతి సంవత్సరం ఒక్కో తరగతి అప్‌గ్రేడ్ కావడంతో 2024 ఫిబ్రవరిలో విద్యాశాఖ.. పాఠశాలకు పది కంప్యూటర్లను అందజేసింది. పాఠశాలలో కంప్యూటర్ విద్య బోధించే ఉపాధ్యాయుడు లేకపోవడంతో కంప్యూటర్లను ఓ గదిలో ఉంచి తాళాలు వేశారు. కంప్యూటర్లు ఉన్న గదికి మూసిన తలుపులు మూసినట్లే ఉన్నాయి.. తాళాలు వేసినట్లే ఉన్నాయి. కిటికీలు మూసి ఉంచారు. ఈ ఏడాది మార్చి 15న నుంచి ప్రైమరీ చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఏఐఏఎక్స్‌ఎల్‌పై అవగాహన కల్పించాలని ఆదేశించింది.

కంప్యూటర్ల రికవరీపై మల్లగుల్లాలు

తాడ్కోల్ పాఠశాలలో ప్రైమరీ విద్యార్థులకు ఏఐ ఏఎక్స్‌ఎల్ నేర్పించాలని కంప్యూటర్ గది తాళం తీశారు. గదిలో పది కంప్యూటర్లు ఉండాల్సిన చోట ఐదు కంప్యూటర్లు మాత్రమే ఉన్నాయి. కంప్యూటర్లు కనపడకపోవడంతో పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులు విషయాన్ని దాచిపెట్టారు. విషయం ఆలస్యంగా బయటకి రావడంతో పాఠశాలలో పని చేసే ఓ ఉపాధ్యాయుడు తన ఇంటికి తీసుకెళ్లిన ఒక కంప్యూటర్‌ను గుట్టుచప్పుడు కాకుండా పాఠశాలకు తెచ్చిపెట్టినట్లు తెలిసింది. మిగత నాలుగు కంప్యూటర్లపై విషయం తేలకపోవడంతో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసప్పను విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారు. మాయమైన కంప్యూటర్లను రికవరీ చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. బాధ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. 2013–2014 విద్యా సంవత్సరంలో బీర్కూర్ మండలం దామరంచ ఉన్నత పాఠశాలలో 10 కంప్యూటర్లు మాయమైనా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విద్యాశాఖ అధికారులపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దామరంచ ఉన్నత పాఠశాలలో మాయమైన కంప్యూటర్లకు, ప్రస్తుతం తాడ్కోల్ పాఠశాలలో మాయమైన కంప్యూటర్లపై లోతుగా విచారిస్తే అసలు విషయాలు బయటపడే అవకాశాలు ఉన్నాయని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేస్తాం



తాడ్కోల్ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ల కనపడటం లేదు. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసప్పపై సస్పెన్షన్ వేటు వేశారు. పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేస్తాం. కనిపించకుండా పోయిన కంప్యూటర్లను రికవరీ చేస్తాం.

– నాగేశ్వర్‌రావు, ఎంఈవో, బాన్సువాడ

వరలక్ష్మి.. వరప్రదాయినీ

- నేడు వరలక్ష్మి వ్రతం
- శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున నిర్వహణ



నిజామాబాద్ రూరల్: శ్రావణ మాసంలో వరలక్ష్మి మాతను మహిళలు ప్రత్యేకంగా కొలుస్తుంటారు. ఈ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఈరోజున వరలక్ష్మి అమ్మవారిని పూజిస్తే సకల శుభాలు కలుగుతాయని, వ్రతం ఆచరించే వారు ఉపవాస దీక్ష పాటించడం శ్రేష్టమని పండితులు చెబుతున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో మహిళలు నేడు వరలక్ష్మి వ్రతాలు నిర్వహించడానికి సిద్ధమయ్యారు. ఈరోజు మహిళలు ఉదయాన్నే లేచి ఇల్లంతా శుభ్రపరుచుకుని, ముగ్గులు తోరణాలు పెట్టి శోభాయమానంగా అలంకరిస్తారు. ధనధాన్య, విద్యా, వైద్య, సంతాన, అష్టలక్ష్మిలను పూజించిన ఫలితము ఈ ఒక్క వరలక్ష్మి వ్రతం నాడు అమ్మవారిని పూజించడంతో దక్కుతుందని పండితులు పేర్కొంటున్నారు.

పూజా విధానం..

ఇత్తడి, రాగి, వెండి, బంగారు చెంబులో కొబ్బరి కాయతో కలశ రూపంలో అమ్మవారిని పూజిస్తారు. కొందరు మహిళలు అమ్మవారిని ప్రార్థించి పాలు తేనె నెయ్యి వంటి వాటితో అభిషేకం నిర్వహిస్తారు. అమ్మవారికి చీరలు, రవికలు పండ్లు బెల్లం నెయ్యితో తయారుచేసిన నైవేద్యాలతో సమర్పించి యధాశక్తిగా పూజిస్తారు. మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన మహిళలయితే బిందెలకు చీరలను కట్టి పూలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే విధంగా అమ్మవారిని పూజిస్తారు. వ్రతం చేసేటప్పుడు గోత్రనామాలతో సంకల్పం చేసుకుంటారు. అలాగే కలశ పూజ, గణపతి, గౌరీ పూజలను సైతం నిర్వహిస్తారు. లక్ష్మీదేవిని పంచామృతాలతో అభిషేకించి, అమ్మవారి నామాలతో, తామర పువ్వులతో పుష్పార్చన కుంకుమార్చన పూజలు నిర్వహించడం శ్రేష్ఠమని పండితులు విశ్లేషిస్తున్నారు. వ్రతం అనంతరం ముత్తయిదువులకు వాయినాలు ఇవ్వడం వల్ల పదికాలాలపాటు అష్టైశ్వర్యాలతో సౌభాగ్యాలతో ఉంటారని భక్తుల నమ్మకం.

ఆలయాలు ముస్తాబు..

నగరంలోని దేవిరోడ్‌లోగల దేవీమాతా ఆలయం, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం, లలితాదేవి ఆశ్రమాలయం, దుబ్బ మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



భిక్కనూరు గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

భిక్కనూరు: ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండగలుగుతారని భిక్కనూరు ప్రభుత్వ వైద్యురాలు యెమిమా అన్నారు. గురువారం భిక్కనూరు గురుకుల పాఠశాలలో పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భోజనానికి ముందు చేతులను కడుక్కునే విధానం గురించి వివరించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎంపీహెచ్‌ఈవో వెంకటరమణ, సూపర్‌వైజర్ రాజమణి, ప్రిన్సిపాల్ రఘు, ఏఎన్‌ఎం యాదమ్మ పాల్గొన్నారు.

కస్తూర్బా వసతి గృహం తనిఖీ

రామారెడ్డి: మండలంలోని కస్తూర్బా వసతి గృహాన్ని రామారెడ్డి ప్రభుత్వ వైద్యాధికారి సురేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. వసతి గృహంలో కూరగాయలు, వంట సామగ్రిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వసతి గృహంలో అనారోగ్యంతో ఉన్న పిల్లలను పరీక్షించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సూపర్‌వైజర్ జానకమ్మ, ఆశ వర్కర్ మంజుల పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అదనపు కలెక్టర్ చందర్ నాయక్ అన్నారు. ఆయన గురువారం ఎర్రాపహాడ్, నందివాడ గ్రామాలలో పర్యటించారు. మంచి నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు కడుగుతూ శుభ్రం చేయాలన్నారు. డ్రెయినేజీలలో ఉన్న మురికి తొలగించి దోమల నివారణకు మందులను పిచికారీ చేయాలన్నారు. రోడ్లపై గుంతలు ఏర్పడినట్లయితే వెంటనే పూడ్చి వేయాలని, లేకుంటే నీరు నిలిచి దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడే అవకాశముందన్నారు. మొక్కలను సంరక్షించి అవి చెట్లుగా మారే వరకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ, తదితరులు ఉన్నారు.

ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కామారెడ్డి టౌన్: మధ్యాహ్న భోజన(ఎండీఎం) కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం డీఈవో ఎస్.రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సోఫియా మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.10 వేల గౌరవ వేతన హామీని అమలు చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ ఇన్సూరెన్స్ సౌకర్యాలను కల్పించాలన్నారు. కోడిగుడ్లను, వంట గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపునూరు చక్రపాణి, కార్మికులు సంగీత, హేమలత, రాజేశ్వరి, సాయిలు, సువర్ణ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన చెవుటి పెద్ద గంగయ్య మూడు రోజుల క్రితం తన ఇంటికి తాళం వేసి, కామారెడ్డి మండలంలోని టెక్రియాల్‌లో ఉన్న తన కూతురు వద్దకు వెళ్లాడు. ఇదే అదనుగా భావించి బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు అతడి ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న 50తులాల వెండి ఆభరణాలు, 2 తులాల బంగారు ఆభరణాలు, రూ.10వేల నగదును అపహరించారు. మరుసటి రోజు ఉదయం చోరీని గుర్తించి బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జర్నలిస్టు కాలనీలో..

బాన్సువాడ: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని జర్నలిస్టు కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. వివరాలు ఇలా.. కాలనీలో నివాసముంటున్న పట్లోళ్ల సుగణ అనే మహిళ శనివారం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లింది. గురువారం సాయంత్రం తిరిగి ఇంటికి చేరుకోగా, ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న రూ.2.50లక్షల నగదు చోరీ చేసినట్లు బాధితురాలు పేర్కొంది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఖలీల్‌వాడి: నగర పరిధిలోని జానకంపేట గ్రామ శివారులో ఉన్న అశోక్ సాగర్ చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు ఆరో టౌన్ ఎస్సై వెంకట్రావు తెలిపారు. చెరువులో గురువారం ఉదయం మృతదేహం పైకి తేలయంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి వయస్సు సుమారు 50 ఏళ్లు ఉంటాయని, అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని ఎస్సై తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు ఆరో టౌన్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

క్రైం కార్నర్

బోర్లం క్యాంపులో ఒకరి ఆత్మహత్య

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంపు గ్రామంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. బోర్లం గ్రామానికి చెందిన పటేల్ నిర్మళ (45)కు బీర్కూర్ మండలం చించోలి గ్రామానికి చెందిన పటేల్ శ్రీనివాస్‌తో 25 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. దంపతుల మధ్య మనస్పర్ధల కారణంగా గత 15 సంవత్సరాలుగా భర్త దూరంగా ఉంటున్నాడు. ఇటీవల పెద్దకూతురుకు నిర్మళ వివాహం జరిపించింది. కానీ రెండో కూతురు పెళ్లి ఎలా చేయాలంటూ బాధపడుతుండేది. దీంతో జీవితంపై విరక్తి చెంది నిర్మళ బుధవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి పెద్దకూతురు సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు

రెంజల్(బోధన్): ఒకరిపై దాడికి పాల్పడిన ఘటనలో మండలంలోని వీరన్నగుట్ట తండా గ్రామానికి చెందిన జాదవ్ రాజుతోపాటు అతడి మిత్రుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ గురువారం తెలిపారు. వీరన్నగుట్ట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు గ్రామానికి చెందిన వీరయ్య నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అతడు బుధవారం అర్ధరాత్రి విధులు నిర్వహిస్తుండగా రాజుతోపాటు అతని స్నేహితుడు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. దీంతో వీరయ్య వారిని ఈ సమయంలో ఎందుకు తిరుగుతున్నారని ప్రశ్నించగా, వారు అతడిపై దాడి చేశారు. ఈమేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

మోపాల్ మండలంలో ముగ్గురిపై..

మోపాల్: మండలంలోని కంజర్ గ్రామంలో మహిళపై దాడి చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుస్మిత తెలిపారు. గ్రామానికి చెందిన కొత్తోళ్ల రాధాతో మోహన్, లక్ష్మి, అనితకు పాత గొడవలు ఉన్నాయి. ఈక్రమంలో రాధకు చెందిన వ్యవసాయ క్షేత్రంలోకి గురువారం వారు వచ్చి అకారణంగా దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాడుతున్న 24 మంది అరెస్టు

మద్నూర్(జుక్కల్): మండలంలోని రెండు పేకాట స్థావరాలపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం రావడంతో బిచ్కుంద సీఐ రవికుమార్, మద్నూర్ ఎస్సై విజయ్ కొండ ఆధ్వర్యంలో పేకాట స్థావరాలపై దాడులు చేసి, పేకాడుతున్న 24 మందిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 34వేల నగదు, 19 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. డోంగ్లీ మండలం మదన్‌హిప్పర్గాలో 20 మందిని, మద్నూర్ మండలం పెద్ద శక్కర్గాలో నలుగురిని పట్టుకున్నట్లు వారు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



బోధన్‌రూరల్: మండలంలోని పెంటాకుర్దు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు దొబ్బ మారుబాయి (105) గురువారం మృతిచెందింది. గ్రామానికి చెందిన ఆమె గ్రామంలో గర్భిణులకు నార్మల్ డెలివరీలు చేయడంతో పేరుపొందింది. గత 75 ఏళ్లల్లో గ్రామంలో సుమారు వెయ్యికి పైగా ప్రసవాలు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామపెద్దలు, గ్రామస్తులు మారుబాయి మృతదేహానికి నివాళులు అర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఇసుక డంపు స్వాధీనం

రుద్రూర్: పోతంగల్ మండలం కల్లూర్ శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను గురువారం తహసీల్దార్ గంగాధర్ స్వాధీనం చేసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు కేటాయించిన ఇసుకను కొందరు అక్రమంగా డంప్ చేసినట్టు గుర్తించారు. ఈ ఇసుకను వర్ని మండలం చింతల్‌పేట్ గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కేటాయించినట్లు ఆయన తెలిపారు.

చేనేత కార్మికులకు కేంద్రం అండ

- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి



దోమకొండలో చేనేత మహిళా కార్మికులతో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

దోమకొండ: చేనేత కార్మికులకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం దోమకొండ మండల కేంద్రంలో గడికోట ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక ఆనంద్‌భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తుందని, చేనేతలకు రుణం, ఇన్సూరెన్స్ సదుపాయాలు అందిస్తుందన్నారు. స్థానిక ఆనంద్‌భవన్‌లో మగ్గాలను ఏర్పాటు చేసి బట్టలను నేయడం, వాటిని ఇతర ప్రాంతాలకు పంపించి అమ్మకాలు చేయడం పట్ల ట్రస్టు ప్రతినిధులను అభినందించారు. చేనేత కార్మికులకు తనవంతుగా ఎలాంటి అవసరం ఉన్నా ఆదుకుంటానని వారికి హామీ ఇచ్చారు. చేనేత మహిళా కార్మికులను శాలువాతో సన్మానించారు. చేనేత జెండాను ఎగురవేశారు. గడికోట వారసులు కామినేని అనిల్‌కుమార్, అపోలో ఆస్పత్రుల డైరెక్టర్ కామినేని శోభన, గడికోట ట్రస్టు మేనేజర్ బాబ్జీ, మాజీ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నల్లపు అంజలి, చాముండేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ సిద్దారెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు కంది మనోజ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు రాఖీలు కట్టిన మహిళలు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి రక్షాబంధన్ సందర్భంగా రాష్ట్రీయ సేవికా సమితి ఆధ్వర్యంలో మహిళలు రాఖీలు కట్టారు. మహిళలకు అన్ని విధాలుగా సోదరుడిగా అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

గల్ఫ్ సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించాలి

రామారెడ్డి: గల్ఫ్ కార్మికులు ఆయా దేశాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీ వేదికగా ప్రస్తావించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని కోరినట్లుగా గల్ఫ్ సమాఖ్య మండలాధ్యక్షుడు బండ సురేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను గురువారం క్యాంప్ కార్యాలయంలో కలిశారు. సన్మానించి గల్ఫ్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్టుగా తెలిపారు.

అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

దోమకొండ: భిక్కనూరు మండలం బీటీఎస్ చౌరస్తా వద్ద దోమకొండకు వెళ్లే దారిలో అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. దోమకొండ, బీబీపేట మండలాలతో పాటు సిద్దిపేట జిల్లాకు వెళ్లే దారి కావడంతో అండర్‌పాస్ బ్రిడ్జి లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చొరవ తీసుకుని పనులు జరిగేలా చూడాలని వారు కోరారు. మాజీ జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీ సర్పంచ్ నల్లపు అంజలి, తదితరులు ఉన్నారు.

సంక్షిప్తం

ఆదర్శ పాఠశాల సందర్శన



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను గురువారం రాష్ట్ర పరిశీలకులు ఉషారాణి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉదయం ప్రార్థన సమయంలో విద్యార్థులు చూపిన ప్రతిభను చూసి అభినందించారు. అనంతరం ఒకేషనల్ ల్యాబ్‌ను పరిశీలించారు. ఒకేషనల్ కోర్సు ద్వారా ఇప్పటివరకు ఎంతమంది విద్యార్థులు ఏఏ రంగాల్లో స్థిరపడ్డారు ప్రిన్సిపల్ రాజిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి అధ్యాపకులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు.

అప్రమత్తంగా ఉండాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పుష్పరాజ్ సూచించారు. ఇటీవల తాళాలు వేసిన ఇళ్లలో దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో గురువారం ప్రజలకు పలు సూచనలు చేశారు. బయటకు వెళ్లేటప్పుడు విలువైన వస్తువులను వెంట తీసుకెళ్లాలని, లేదా నమ్మకం ఉన్న వారి బంధువుల వద్ద, పక్కింటి వారి వద్ద అప్పగించాలన్నారు. కుటుంబ సభ్యులందరూ ఊరెళ్లితే కనీసం బంధువులనైనా ఇంట్లో ఉంచి వెళ్లాలని సూచించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఏఎస్సై జగదీశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

30వ రోజు ఉపవాస దీక్ష విరమణ




కామారెడ్డి అర్బన్: జైనుల చాతుర్మాస్య ఉత్సవాల్లో భాగంగా నిరాహార ఉపవాస దీక్ష పాటిస్తున్న అర్చన బోరందియాను జైన సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. పూర్తి ఉపవాస దీక్షను పాటించిన అర్చన బోరందియా జైన గురువుల సలహా మేరకు బుధవారం 30వ రోజున ఉపసంహరింపజేశారు. కఠోర ఉపవాస దీక్ష పాటిస్తున్న మరో వ్యక్తి సుశీల్‌కొఠారిని సైతం 30వ రోజు శుక్రవారం దీక్ష విరమింపజేస్తారని ప్రతినిధులు తెలిపారు. జైన సంఘం ప్రతినిధులు కమల్‌చంద్, దిలీప్‌బోరా, మహేష్ ఫించా, రికబ్‌చంద్, తదితరులు పాల్గొన్నారు.

రేపు శనేశ్వరుడికి తైలాభిషేకం

కామారెడ్డిఅర్బన్: శ్రావణ పౌర్ణమి సందర్భంగా శనివారం ఉదయం 5 గంటల నుంచి స్థానిక జయదుర్గా సమేత శ్రీవైద్యనాథేశ్వర ఆలయ ప్రాంగణంలోని శనిశింగనపురం శ్రీశనేశ్వరుని విగ్రహానికి నువ్వుల నూనెతో అభిషేకం నిర్వహించనున్నట్టు ఆలయ ప్రతినిధి యాద అనిల్‌కుమార్ తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అర్చకుడి మృతికి సంతాపంగా బంద్



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని బాలాజీ మందిరం, గంగిశెట్టి హనుమాన్ ఆలయాల పూజారి తివారి గోవింద్ మహారాజ్(55) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 30 ఏళ్లగా రెండు ఆలయాల అర్చకుడిగా పని చేసిన గోవింద్ మహారాజ్ మృతికి సంతాపంగా వ్యాపారులు బంద్ పాటించారు. గురువారం ఆయన అంత్యక్రియలను నిర్వహించారు.